www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 జులై 2024
5
తూర్పుగోదావరి



16న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

రాజమహేంద్రవరం : నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జులై 16న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ సంస్థ, క్యూస్ కార్పొరేషన్‌లో పనిచేసేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాల జిరాక్సులతో హాజరుకావాలని సూచించారు. ఇంటర్ ఆపై చదువుకున్న 29 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో రిటైల్ బ్యాంక్‌లో 14 బ్యాంక్ మిత్ర పోస్టులు, ఐఐఎఫ్ఎల్ సంస్థలో కస్టమర్ రిలేషన్ షిప్ ఆఫీసర్ పోస్టులు 100, క్యూస్ కార్ప్‌లో బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ / రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 200 ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు ఎంపికైన వారికి రూ.11 వేల నుంచి రూ.15వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8328486787, 9492168132 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అమ్మో..! జులై

- ఈ నెలలో గోదావరికి వరద
- రెండేళ్ల క్రితం ఉక్కిరిబిక్కిరైన పరివాహక ప్రాంతాలు
- క్రమంగా పెరుగుతున్న వరదనీరు



2022లో ఇదే నెలలో వచ్చిన వరదలకు మునిగిన రాజోలు లంక గ్రామం(ఫైల్)

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జులై నెల వచ్చిందంటేనే గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గోదావరి ఎగువన, దిగువన వర్షాలు ఎక్కువగా కురవడంతో ఈ నెలలోనే ఎక్కువ సార్లు గోదావరి వరదతో పోటెత్తుతోంది. ప్రస్తుతం కూడా ఎగువన వర్షాలు ఎక్కువగా కురవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరికి వరద నీరు క్రమంగా చేరుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీలోని 175 గేట్లలో 85 గేట్లు ఎత్తి దిగువకు 52,546 క్యూసెక్కుల నీటిని సముద్రంలోనికి విడుదల చేస్తున్నారు.

గతేడాది జులై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలలు భద్రాచలం ఏజెన్సీతో పాటు కోనసీమలోని నదీ పరివాహక ప్రాంతాలు, లంక వాసులను వరద భయం కంటిమీద కునుకులేకుండా చేసింది. గోదావరికి ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి నదుల నుంచి వరద నీరు వచ్చి చేరడంతో ప్రతి ఏటా గోదావరి మరింత ఉగ్రరూపం దాల్చుతోంది. 2022 జులై 16న భద్రాచలం వద్ద గరిష్ఠంగా 71.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. 1986లో 74 అడుగుల నీటి మట్టం నమోదైన విషయం విదితమే. 35 ఏళ్ల తరువాత 70 అడుగుల మార్కును మరోసారి దాటింది. గతేడాది జులై 17న భద్రాచలం వద్ద 48 అడుగుల నీటిమట్టం నమోదు కాగా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద 21.70 అడుగుల నీటిమట్టం నమోదు కాగా అయింది. తాజాగా జులై నెలలోనే వరద నీరు చేరటంతో ఈసారి వరదల తీరు ఏవిధంగా ఉంటుందోనని పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జులైలోనే అత్యధిక సార్లు వరద పోటు

1953 నుంచి ఇప్పటి వరకు గోదావరి 30 సార్లు మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించింది. గోదావరి నది చరిత్రలో రికార్డు చేసిన వివరాల ప్రకారం 1953లో తొలిసారి 72.5 అడుగుల స్థాయిలో గోదావరికి వరదలు రావడంతో అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. అప్పట్లోనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గోదావరి నదీతీరంలో ఉన్న గ్రామాలు మెరక ప్రాంతాలకు తరలాయి. 1986లో 74.6 అడుగుల రికార్డు స్థాయి వరద రావడంతో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయి. వందలాది గ్రామాలు జల సమాధి అయ్యాయి. సర్వం కోల్పోయిన అనేక గ్రామాల ప్రజలు మెరక ప్రాంతాల వైపు ఇళ్లు నిర్మించుకొని వరద నుంచి బయటపడ్డారు. 1990లో 70.8 అడుగులు రావడంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కుక్కునూరు, వేలేరుపాడు, వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, చింతూరు మండలాలు వరద బీభత్సానికి గురయ్యాయి. జులైలోనే గోదావరి 11 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటడమే కాకుండా ఇందులో నాలుగుసార్లు తుది ప్రమాద హెచ్చరికను (53అడుగులు)సైతం దాటడం గమనార్హం.

1972 జులై 6న 44.3 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైంది. 1976 జులై 22న 63.9 అడుగులు, 1988 జులై 29న 54.3, 2003 జులై 27న 45.8, 2008 జులై 6న 47.3, 2013 జులై 19న 57, 2013 జులై 24 56.7, 2016 జులై 12న 52.4 అడుగుల నీటిమట్టం నమోదు అయ్యింది. 2022 జులై 16న 71.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం వద్ద 1986 ఆగస్టు 16న 24.55 అడుగుల గరిష్ట నీటిమట్టం నమోదైంది. అప్పటి వరదకు వేలాది మంది నిరాశ్రయులయ్యారు. దాదాపు నెలరోజుల పాటు ఇళ్లకు దూరమయ్యారు. 1990 ఆగస్టు 25న 22.75 అడుగుల నీటిమట్టం నమోదయింది. 2006 ఆగస్టు 7న 22.80 అడుగులు నీటిమట్టం నమోదైంది. 2022 జులై 17న భద్రాచలం వద్ద 48 అడుగుల నీటిమట్టం నమోదు కాగా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్ వద్ద 21.70 అడుగుల నీటిమట్టం నమోదైంది.

ఆందోళనలో పరివాహక ప్రాంత ప్రజలు

గతేడాది ధవళేశ్వరం బ్యారేజీ ఎగువను ఉన్న సీతానగరం మండలంలోని ములకల్లంక గ్రామం పూర్తిగా నీట మునిగింది. దిగువన అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద కాజ్‌వేపై, మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే, పి.గన్నవరం మండలం చాకలిపాలెం కాజ్‌వేల వద్ద డేంజర్ బెల్స్ మోగాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కోనసీమ – పశ్చిమ గోదావరి జిల్లాలను కలిపే కనకాయిలంక కాజ్‌వే వరద నీటిలో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాజమహేంద్రవరంలో పుష్కర్ ఘాట్, కోనసీమలోని కొన్ని లంకలను ఏటిగట్టు వద్ద ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి వరద పోటును కొంత మేర కట్టడి చేశారు. కోటిలింగాలపేట, శేషయ్యమెట్ట, ఆల్కాపురం, మల్లయ్యపేట, ధవళేశ్వరంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ముందుకు వెళ్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో పరిశ్రమలు, నైపుణ్య అభివృద్ధి, డిఆర్‌డిఎ, ఎపిఐఐసి, జిల్లా అభివృద్ధి అధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన ద్వారా ప్రయోజనం పొందుతున్న వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పారిశ్రామిక పాలసీల అమలు తీరును సమీక్షించారు. జిల్లాలో క్లస్టర్ల ద్వారా పారిశ్రామికంగా సాధించిన పురోగతిపై సమీక్ష చేశారు. రాజానగరం మండలంలో వుడెన్ క్లస్టర్ యూనిట్స్ ఏర్పాటు కోసం కలవచర్లలో స్థలం అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. త్వరలో క్షేత్ర స్థాయిలో పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక పాలసీ విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ పర్పస్ ప్రోగ్రాం కింద యూనిట్స్ ప్రోత్సాహకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కామన్ ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుపై ఆరా తీశారు. స్వయం ఉపాధి, సేవా రంగం, ఎంఎస్‌ఎంఇ యూనిట్స్ వివరాలు తెలుసుకున్నారు. పిఎం విశ్వకర్మ, ఇతర అవకాశ రంగాల విధానంలో పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వచ్చే ఐదారునెలల కోసం ప్రాథమికంగా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పిఎం విశ్వకర్మపై సమన్వయ శాఖలు సమగ్ర నివేదిక, శాఖల వారీగా కార్యచరణతో రావాలన్నారు. దీనిపై శనివారం సమీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. పారిశ్రామిక రంగాల యూనిట్స్ గుర్తింపు, నిరుద్యోగ యువత వివరాలు నైపుణ్యాభివృద్ధి సంస్థకి అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారి పికెపి.ప్రసాద్, ఎపి ఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్లు డివిఎస్ఎన్ జ్యోత్స్న దేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో వాక్‌థాన్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఒఎన్‌జిసి సిబ్బంది, విద్యార్థులు

స్వచ్ఛత పఖ్వాడా– 2024'లో భాగంగా ఒఎన్‌జిసి రాజమండ్రి అసెట్ ఆధ్వర్యంలో శుక్రవారం కంబాలచెరువు నుంచి పుష్కరఘాట్ వరకు 'వాకథాన్'ను నిర్వహించారు. ఒఎన్‌జిసి, కలెక్టివ్స్‌కు చెందిన దాదాపు 200 మంది ఉద్యోగులు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ వాక్‌థాన్‌లో పాల్గొన్నారు. 'స్వచ్ఛత పఖ్వాడా– 2024' జులై 1న ప్రారంభమైంది. జులై 15న ముగుస్తుంది. రెండు వారాల ప్రచారంలో, వ్యర్థాల విభజన, సైట్‌లు, కార్యాచరణ ప్రాంతాల్లో పరిశుభ్రత డ్రైవ్‌లపై వర్క్‌షాప్‌లతో సహా అనేక కార్యకలాపాలు నిర్వహించారు. వ్యర్థాల ముప్పు గురించి యువతకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలకు క్విజ్‌లు, పోస్టర్ల తయారీ, నినాదాల పోటీలు కూడా నిర్వహించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సమస్యలపై కళాజాతాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా అసెట్ మేనేజర్ శాంతానుదాస్ మాట్లాడారు. భారత ప్రభుత్వం 2016లో 'స్వచ్ఛత పఖ్వాడా'ను ప్రారంభించిందని, అప్పటి నుంచి ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం, 'వేస్ట్ టు వెల్త్' అనే థీమ్‌తో, రాజమండ్రి అసెట్ తన ఆపరేషన్ ప్రాంతాల చుట్టూ పరిశుభ్రత మరియు మూలం వద్ద వ్యర్థాల విభజనను ప్రోత్సహించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించిందన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి – ఉండ్రాజవరం


మండలం పరిధిలోని పాలంగి సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని పాలంగి, కె.సావరం, చివటం గ్రామాల్లో, ఇండస్ట్రియల్ ఫీడరు పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామన్నారు. ఈ సబ్ స్టేషన్ల పరిధిలో గల వ్యవసాయ బోర్లకు 3 ఫేస్ కరెంటు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందిసాత్మన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని నిడదవోలు ఎపి ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు.

బస్సు సర్వీసుల కోసం ఎంఎల్ఎ వినతి

ప్రజాశక్తి – సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో రాజమండ్రి నుంచి నూతన బస్సు సర్వీసులను ప్రారంభించాలని, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారికి వినతిపత్రం అందించారు. పాత తుంగపాడు వయా హౌసింగ్ బోర్డు కాలనీ, దివాన్ చెరువు, శ్రీరామపురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం మీదుగా పాత తుంగపాడు వరకు, కోరుకొండ నుండి కాపవరం, మునగాల, కూనవరం, మరియు ముగ్గుళ్ళ రఘుదేవపురం మీదుగా సీతానగరం, అలాగే గోకవరం నుంచి బుచ్చంపేట, మిర్తిపాడు మీదుగా రాజమండ్రి వెళ్లే బస్సు సర్వీసులను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నమ్, సూపర్ వైజర్ మాచన రాజబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో అన్ని పన్నులను నూరు శాతం వసూలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఇన్‌ఛార్జి జెసి కె.దినేష్‌కుమార్‌తో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పన్ను లు, పన్నేతర వసూళ్లకు సంబంధించి రాజమండ్రి నగర పాలక సంస్థ, 300 గ్రామ పంచాయతీల్లో కలిపి రూ.200,27 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ రూ.120.19 కోట్లను వసూలు చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లోగా వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో పన్నేతర వసూళ్ల 63 శాతం, పన్నుల వసూళ్ల 70 శాతం మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ అమలు విషయంలో మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. పిఎం విశ్వకర్మ కింద 45 వేల లబ్ధిదారులను నమోదు చేశామన్నారు. వారికి ఐదురోజుల పాటు కార్యశాల నిర్వహించి నియమ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి జెసి దినేష్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకి ఇసుకను భవన నిర్మాణ ప్లాన్ అనుసరించి కేటాయించాలన్నారు. ఉచిత ఇసుక పంపిణీలో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఇళ్ల నిర్మాణం, మరమ్మతుల విషయంలో టౌన్ ప్లానింగ్, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రం జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఆమేరకే ఇసుకను కేటాయిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.రాంబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంసిని అభివృద్ధి చేస్తాం : ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి – గోపాలపురం

గోపాలపురం ఎఎంసిని అభివృద్ధి చేస్తానని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. శుక్రవారం గోపాలపురం మార్కెట్ యార్డ్ గొడౌన్లో నూతన నాఫెడ్–ఆయిల్ ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెంట్రల్, స్టేట్ గవర్నమెంట్ అనుబంధంతో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని గోపాలపురంలో ఏర్పాటు చేశామన్నారు. దూరప్రాంతాలకు వెళ్లకుండా రవాణా ఖర్చు తగ్గించేందుకు రైతులకు చేరువలో ఈ కొనుగోలు కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కటింగ్ ఎండి కొబ్బరి క్వింటాకు రూ.11,160, రౌండ్ బాల్ కొబ్బరి క్వింటాకు రూ.12వేల ధర లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో వరి, మొక్కజొన్న వంటివి ఇతర పంట ఉత్పత్తులను దాచుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా ఉపాధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కాకులపాటి లత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధుల కూడా పాల్గొన్నారు. ఎంఎల్ఎ వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో అక్కడే ఉన్న టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిపాటి ఉద్రిక్తత వాతవరణం చోటుచేసుకుంది.. వెంటనే ఎమ్మెల్యే టిడిపి నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, ఎంపిడిఒ కె.రమేష్, కొర్లపాటి అన్నవరం, నందమూరి సత్యనారాయణ, గద్దె హరిబాబు, గన్నిన మురళి, వడ్లమూడి రమేష్, గంద్రోతు శ్రీనివాసరావు, కొబ్బరి కొనుగోలు కేంద్రం స్టేట్ కో–ఆర్డినేటర్ యు. సుధాకర్‌రావు, ఎపిఒ రమణ పాల్గొన్నారు.

సేవాభావాన్ని కలిగి ఉండాలి

ప్రజాశక్తి– కడియం

చిన్నతనం నుంచే సేవాభావాన్ని కలిగి ఉండాలని హెచ్‌ఎం టి.సత్యనారాయణ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ, కో–ఆర్డినేటర్ వై.ప్రకాష్‌కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ రెడ్ క్రాస్ శిక్షణ కార్యక్రమం కడియం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. హింసను విడనాడాలని తెలిపారు. కో–ఆర్డినేటర్ ప్రకాష్ మాట్లాడుతూ అనునిత్యం ఎన్నో ప్రమాదాలు చూస్తుంటామని అలాంటి సమయాల్లో ప్రథమ చికిత్స చేసి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రథమ చికిత్స ఎలా చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో రెడ్ క్రాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నోడల్ ఆఫీసర్ గొల్లపల్లి సత్యనారాయణ, టీచర్ బి.సువర్ణవేణి పాల్గొన్నారు.

2,600 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి

ప్రజాశక్తి – చాగల్లు

చాగల్లు మండలంలో ఇప్పటి వరకూ 2,600 హెక్టార్లలో వరినాట్లు పూర్తి అయ్యాయని ఎఒ కె.వేణుగోపాలకృష్ణ తెలిపారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,200 హెక్టార్లలో నాట్లు పడే అవకాశం ఉందన్నారు. స్వర్ణ, ఎంటియు 1318, పిఎల్ ఎ1100 వంటి రకాలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. వర్షాల నేపథ్యంలో పంటబోదెలు శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగునీరు వెళ్లేలా చూసుకోవాలన్నారు. ఊడ్చిన మూనలు మునగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో సొసైటీల ద్వారా యూరి యా, కాంప్లెక్సు, ఎంఒపి ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయం : ఎంఎల్ఎ వాసు



వార్డులో పర్యటిస్తున్న ఎంఎల్ఎ వాసు

రాజమహేంద్రవరం: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు అన్నారు. శుక్రవారం స్థానిక 25వ వార్డులో మంగళవారపు పేట నుంచి కంచుమర్తి వారి వీధి వరకు ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు మెరుగైన శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. వార్డులో చేపట్టిన పనుల్లో జాప్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పది రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌తో మాట్లాడినట్టు తెలిపారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులకు చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. నగరంలో సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీధిదీపాలను బాగు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

'మత్తు' అనర్థాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి – తాళ్లపూడి

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తహశీల్దార్ శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు 'డ్రగ్స్ వాడకం–నష్టాలు' అనే అంశంపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి రోజూ విద్యార్థులకు డ్రగ్స్ నష్టాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ఇంటర్, డిగ్రీ కళాశాలల్లోనూ డ్రగ్స్ రహిత సమాజం కోసం మనం'అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు బాలమణి, నెహ్రూజీ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పొదుపుపై విద్యార్థులకు అవగాహన

తాళ్లపూడి: ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే పొదుపై అవగాహన కలిగి ఉండాలని,ఎంతో కొంత పొదుపు చేస్తే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చుని శ్రీవిజేత హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.విజయలక్ష్మి అన్నారు. హెచ్‌ఎం డాక్టర్ జె.ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్కూల్ సేవింగ్ బ్యాంకుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాధ్యాయులు రమణ, కరుణ, కరిష్మా, స్వాతి, హర్షప్రియ వర్ష, హేమ పాల్గొన్నారు.

జేగురుపాడులో స్టూడెంట్ కిట్ల పంపిణీ

కడియం : ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్స్‌ను ఉపయోగించుకొని మంచి విద్యాబుద్ధులు అలవర్చుకోవాలని, సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. శుక్రవారం ఈ కిట్లను ఆయన విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, హెచ్‌ఎం సురేష్, స్కూల్ కమిటీ చైర్మెన్ కేశనపల్లి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, నాయకులు గారపాటి అమరనాథ్, నాగిరెడ్డి వీరశివాజీ, సాకా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

14న శరత్‌బాబు సంస్మరణ సభ

రాజమహేంద్రవరం : ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు జిఎస్.బాలాజీ దాస్ ద్వితీయ కుమారుడు జి.శరత్‌బాబు సంస్మరణ సభ ఈ నెల 14న భద్రాచలం భగవాన్‌దాస్ కాలనీలో జరుగుతుందని ఆయన సోదరుడు జిఎ.భూషణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శరత్‌బాబు ఈ నెల 4న భద్రాచలంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

బిక్కవోలు : కొంకుదురు గ్రామంలో కొవ్వూరు సత్తిరెడ్డి ఉన్నత పాఠశాలలో 172 మంది విద్యార్థులకు కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఎలాంటి ఆర్థిక భారం పడకూడదనే కారణంతో ప్రభుత్వం కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ చింత శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్తి తాతారెడ్డి, పిఎంసి చైర్మన్ శ్రీలక్ష్మి, హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీమహతి విద్యార్థికి ట్రిపుల్ ఐటిలో సీటు

సీతానగరం : శ్రీమహతి విద్యార్థి కొల్లి నాగసూర్యహర్ష ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఐఐటి, నీట్ ఫౌండేషన్ అకడమిక్ డైరెక్టర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో తమ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. హర్షను, అతని తల్లిదండ్రులు నాగేశ్వరరావు దంపతులను యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా కోరె జయంతి

రాజమహేంద్రవరం : ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఇలియాస్ జేమ్స్ కొరే 97వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం ఇన్‌ఛార్జి టి.శ్రీనివాస్‌రావు మాట్లాడారు. రసాయన శాస్త్రంలో వినూత్నమైన పరిశోధన పద్ధతులు, వందలాది కొత్త సమ్మేళనాల సంశ్లేషణ ఆవిష్కరణల ద్వారా కోరె ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ అధ్యాపకులు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.రామకృష్ణారావు హాజరై మాట్లాడారు. కోరే జీవిత ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బి.వెంకట్రావు, కె.వెంకట్రావు, డాక్టర్ నరసింహమూర్తి డాక్టర్ బేబినిర్మాల, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్స్ రికవరీకి ప్రత్యేక టీమ్‌లు

ఉండ్రాజవరం : చోరీకి గురైన మొబైల్స్ రికవరీకి ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామని ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు. ఈ టీమ్‌లు రికవరీ చేసిన మొబైల్స్‌ను సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందిస్తామన్నారు. సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంటే కొనుగోలు చేసిన బిల్లు, ఐఎంఇఐ నెంబర్, ఆధార్ కార్డుతో పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా రికవరీ చేసిన రెండు మొబైల్స్‌ను సంబంధిత వ్యక్తులకు అందించారు. మొబైల్‌ను రికవరీ చేసిన టెక్నికల్ టీమ్ వై.రాజు, వై.నాగేశ్వరావులను ఎస్ఐ అభినందించారు.

పిహెచ్‌సిలో తనిఖీలు

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం పిహెచ్‌సి, ఉండ్రాజవరం–1 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర శుక్రవారం పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా కాచిచల్లార్చిన నీటిని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. సిబ్బందికి క్లోరినేషన్, లాగ్ బుక్ నిర్వహణపై అవగాహన కల్పించారు. వాటర్ ట్యాంకులను ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, ఆర్.ఉషాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, నాగమణి, క్షయ వ్యాధి నివారణ పర్యవేక్షకులు ఆశాజ్యోతి, భీమరాజు, ఎల్‌టి.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పి పూజశ్రీదుర్గ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కడియం: చిన్నారుల విద్యారంగం కోసం ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు పెడుతోందని, వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుకోవాలని మురమండ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు), దేవళ్ల రామ్మోహనరావు అన్నారు. పుట్టిన గ్రామంపై ఉన్న మమకారం, గ్రామంలో చిన్నారులు అందరూ విద్యావంతులు కావాలనే సంకల్పంతో వారు రూ.15వేల విరాళాన్ని హెచ్‌ఎం బిసుధకు శుక్రవారం అందించారు. వారు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

నేరాలు ఘోరాలు

బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-రాజోలు

బాలికను వేధింపులకు గురి చేసిన పొన్నమండ గ్రామానికి చెందిన యర్రంశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు రాజోలు ఎస్ఐ జి.పృధ్వి తెలిపారు. ములికిపల్లి గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలికను దుర్గాప్రసాద్ గత మూడు నెలలుగా వెంటపడి వేధిస్తున్నాడని, నన్ను ప్రేమించక పోతే అంతు చూస్తానని బెదిరింపులకు గురి చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. గురువారం బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుర్గా ప్రసాద్ దాడికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో బాలిక తల్లి అక్కడకు చేరుకోవడంతో పారిపోయాడు. బాలిక తండ్రి దొమ్మేటి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దుర్గా ప్రసాద్ పై పోక్సో యాక్టు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు



రెయిలింగ్‌ను ఢీకొన్న కారు

ఫ్లయ్ ఓవర్‌పై కారు బీభత్సం

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై శుక్రవారం ఒక కారు బీభత్సం సష్టించింది. ఈ ప్రమాదంలో ఒక బైకర్‌కు తీవ్ర గాయాలుయ్యాయి. మద్యం మత్తులో కారు వేగంగా నడిపి బైకును కారుతో డ్రైవర్ ఢీ కొట్టాడు. అనంతరం వంతెన రెయిలింగ్‌ను ఢీకొని కారు నిలిచి పోయింది. గాయపడిన నూకరాజును స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి పంతంకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

మాజీ మంత్రి పంతం పద్మనాభం 25వ వర్థంతి సందర్భంగా కాండ్రకోటలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరినా చివరి వరకు పేద ప్రజల అభ్యున్నతి కోసం కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఊటా నాగబాబు, రెడ్డి బాబులు, గవరసాన సూరిబాబు, ఎలిసెట్టి వెంకటేశ్వర్లు, గంటా రామస్వామి, ఒబిలిశెట్టి నాగభూషణం, చల్లాబత్తుల బాబు, గవరసాన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఘర్షణ పడుతున్న జనసేనలో రెండు గ్రూపులు

రాజోలు జనసేనలో గ్రూపుల పోరు

జాతీయ రహదారిపై కొట్టుకున్న నాయకులు

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు జనసేన పార్టీలో రెండు గ్రూపుల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు కొట్లాటకు దారి తీసింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దిరిశాల బాలాజీ, జిల్లా ఎన్నికల సమన్వయ కర్త పినిశెట్టి బుజ్జి వర్గానికి, ఎన్నారై యెనుముల వెంకటపతి రాజు గ్రూపునకు మధ్య విభేదాలు తలెత్తాయి. సోషల్ మీడియా వేదికగా ఒకరిని ఒకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకుంటున్నారు. గురువారం వెంకటపతి రాజా దిరిశాల బాలాజీ,పినిశెట్టి బుజ్జి లను హెచ్చరిస్తూ ఫేస్ బుక్ లో ఒక పోస్టు పెట్టారు. శుక్రవారం రాజోలులో ఒక పుట్టినరోజు వేడుకలో రెండు గ్రూపుల వారు హాజరు అయ్యారు. అక్కడ వెంకటపతి రాజా పెట్టిన పోస్టుపై చర్చ జరగడంతో ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ జాతీయ రహదారిపైకి చేరుకుని పోలీసుల ఎదుటే కొట్టుకున్నారు. ఎస్ఐ పధ్వీ తన సిబ్బందితో రెండు గ్రూపులను అదుపు చేశారు. యెనుముల వెంకటపతి రాజు వర్గీయులు తమ పై దాడి చేసి గాయపరిచారని పినిశెట్టి బుజ్జి వర్గీయులు ఐదుగురు వ్యక్తుల పై పోలీసులకు పిర్యాదు చేశారు.

మీడియా ప్రతినిధి పై దాడి

జనసేన పార్టీలో రెండు గ్రూపుల మధ్య కొట్లాట జరుగుతున్న సమయంలో న్యూస్ కవరేజ్ చేస్తున్న సివిఆర్ న్యూస్ ఛానెల్ రిపోర్ట్ గుబ్బల ప్రసాద్ పై జనసేన నాయకుడు పినిశెట్టి వెంకట స్వామి దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిఆర్ రిపోర్ట్ గుబ్బల ప్రసాద్ పై జరిగిన దాడిని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటనపై శనివారం పోలిసు ఉన్నతాధికారులను కలసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు జర్నలిస్ట్ సంఘాల నాయకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటికి కె.గంగవరం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం జిల్లా పరిషత్ హై స్కూల్ కి చెందిన విద్యార్థిని ఒరుగంటి నాగమణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని హై స్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థినికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



విద్యార్థిని నాగమణి

యుడిసి ఉద్యోగులకు బదిలీలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న యానాంకు చెందిన యుడిసిలను బదిలీలు చేస్తూ డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. సిహెచ్ కాశీ కృష్ణను యానాం కోఆపరేటివ్ శాఖకు, కరెడ్ల అరుణా దేవిని డిప్యూటీ కలెక్టర్ ఆఫీసు, కడింశెట్టి సుషాంత్ రెడ్డిని యానాం పోలీస్ శాఖకు, ముత్యాల శ్రీరమ్యని ప్రభుత్వ ఆసుపత్రికి, వి.వసంతకుమార్‌ను ఎంజిజి ఆర్ట్స్ కాలేజీ మాహేకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని సంబంధిత అధికారులు 15 రోజుల్లో రిలీవ్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాజులూరు

రక్షణ చట్టాలపై మహిళలు, బాలలు అవగాహన కలిగి ఉండాలని దుగ్గుదురు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుప్రియ అన్నారు. శుక్రవారం పల్లిపాలెంలో మహిళలకు రక్షణ చట్టాలైన దిశ, గృహహింస, బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు తదితర చట్టాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ సుప్రియ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో మహిళలతో మాట్లాడారు. మహిళలకు ఉన్న రక్షణ చట్టాలను వినియోగించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామంలో మంచి నీటిని కాచి చల్లార్చిన అనంతరం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళ్యాణి, సచివాలయ సిబ్బంది రామలక్ష్మీ భవాని, దేవి, ఎఎన్ఎం.దుర్గాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ వరలక్ష్మి, సుజాత, చంద్ర కళావతి, లక్ష్మి వర్కర్లు పాల్గొన్నారు.



మరమ్మతులు చేసిన టిడిపి నాయకులు

అధ్వాన రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లిలోని సింగరాయపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షులు పోతుల మోహన్ రావు ఆధ్వర్యాన గోతుల్లో నిండిపోయిన వర్షపు నీటిని తొలగించి షట్రుతో పూడ్చారు. త్వరలోనే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యలమాటి కాశీ, వెంపాటి రాజు, రెడ్డి సుబ్బారావు, పైలా వెంకన్న, బొల్లంరెడ్డి రామకష్ణ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ తగదు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం ఆదిత్య డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం క్లాసులు నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు అభ్యంతరం తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానికి అమలాపురంలోని ఆదిత్యా డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ తో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ శంకర్ శుక్రవారం మాట్లాడారు. నిబంధనలరే విరుద్ధంగా డిగ్రీ క్లాసులు నిర్వహించడం తగదని తక్షణం క్లాసులు జరపడం ఆపాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న తరుణంలో ఆదిత్యా కాలేజీపై ఉన్నత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పిడిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ పురపాలక ప్రభుత్వ పాఠశాల్లో 60 మంది విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. వీటిని ద్రాక్షారామ శంకర్ నారాయణ, బాలాజీ బుక్ షాప్, లావణ్య, సరస్వతి బుక్ షాప్స్, హెల్పింగ్ లిటిల్ స్మైల్ పలివెల వెంకట్ సహకారంతో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అంబేద్కర్ అబ్రహం లింకన్, నెల్సన్ మండేలా స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, పివైఎల్.అంబటి కృష్ణ, కరిపోతుల నవీన్, చింతా రాజారెడ్డి, ఎస్.దుర్గాప్రసాద్, ఎం.సాయి, ఉపాధ్యాయులు బివి.హనుమాన్, బి.కష్ణ, దేవుల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు..

ధర్మారావు దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రముఖ అంబేద్కరీయుడు, బౌద్ధ ఉపాసిక, సుదీర్ఘ కాలం పాటు ఆర్‌టిసి ఉద్యోగిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన నిమ్మీతి ధర్మారావు దంపతులను మండల బిఎస్ఐ ఘనంగా సత్కరించింది. అయినాపురం నీలంవారిపేటలో శుక్రవారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల శాఖ సమావేశం తిరుకోటి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో ఉపాసిక శరత్ మాట్లాడుతూ ఈ నెల 17న అమలాపురం అంబేద్కర్ భవన్‌లో జరిగే ఆర్‌పిఐ మాజీ ఎంఎల్ఎ ఉపాసిక బివి.రమణయ్య 90వ జయంతి ఉత్సవం మరియు బౌద్ధ జీవన పరిచయ సదస్సు కు బౌద్ధులు, అంబేద్కరీయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌టిసిలో సుదీర్ఘ కాలం పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ధర్మారావు దంపతులను బిఎస్ఐ మరియు గ్రామ మహిళలు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు ధర్మారావు దంపతులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాసిక కాశి సింహాద్రి వర్మ, కాశి మూర్తి, మచ్చా హరికుమార్, చిరంజీవి, గెడ్డం వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, డి.దుర్గా ప్రసాద్, వెంకట రమణ, శ్రీహరిలతో పాటు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మారావు దంపతులను సత్కరించిన బిఎస్ఐ మరియు మహిళలు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటరావు

సచివాలయాల్లో సేవలను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-కాకినాడ

సచివాలయ ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. శుక్రవారం ఆయన 50 బి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు.

భవిత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత వికలాంగుల ప్రత్యేక పాఠశాలను శుక్రవారం స్టేట్ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు సందర్శించి పాఠశాల పరిసరాలు, నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం వారు భవిత డాక్యుమెంటేషన్, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి లెర్నింగ్ మెటీరియల్‌పై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు చౌదరి, శర్మ, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

యర్రంపాలెంలో ఉపాధి హామీ చట్టం మస్తర్లను శుక్రవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. కూలీలకు వేతనాలు, పనుల కొలతలు గురించి అడిగి తెలుసుకున్నారు. మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉద్యానవన పంటల పెంపకం, బండ్ ప్లాంటేషన్, ఫారంపాండ్స్, కాటిల్ షెడ్స్, అర్హులైన రైతులందరికీ పనులు ప్రపోజల్స్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ గంగాభవాని, ఇసి రమేష్, టెక్నికల్ అసిస్టెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని బ్రౌన్‌పేట సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిల ఈవ్‌టీజింగ్‌పై సిఐ సురేష్, ఎస్ఐలు మూర్తి, మౌనిక, హెచ్‌సి రాజు సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆడపిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

సూర్య బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం లో అమలాపురం సూర్యబలిజ సంఘ సమావేశం గౌరవ అధ్యక్షులు మద్దుల రవినాగేశ్వరావు, గౌరవ సలహాదారుడు ముద్దుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అమలాపురం సూర్యబలిజ సంఘ అధ్యక్షుడుగా భాస్కర్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కాళే సురేష్, సెక్రటరీ గా యండమూరి శివకేశవ, జాయింట్ సెక్రటరీగా పందిరి శ్రీనివాస్, ట్రెజరర్‌గా ధరణికొట శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కాళే వెంకటేశ్వరావు, కార్యవర్గ సభ్యులుగా కోటిపల్లి వీరబాబు, గూడూరి సురేష్, సరిదే రమణ, దుగ్గిరాల లక్ష్మీ నరసింహారావు , ఘంటసాల వీర వెంకట సత్యనారాయణ, యండమూరి రాము, వాల్మీకి వీర్రాజు, అన్నాబత్తుల సత్తిబాబు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాటిపాక గ్రామ సర్పంచ్ కోటిపల్లి రత్నమల, తాటిపాక గ్రామ సూర్యబలిజ సంఘ మాజీ అధ్యక్షుడు మద్దుల కాసుబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సూర్యబలిజ సంఘం అధికార ప్రతినిధి కాళే వెంకటరత్నం, అంజిబాబు(చెన్నై) హాజరైనారు. సూర్యబలిజ సంఘం కులస్తులు అన్ని రంగాలలో చైతన్య వంతులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్రావు, కాళే కనిక లింగేశ్వరరావు, మద్దుల రమేష్ నాయుడు, మద్దుల తేజ, సరిదే రామరాజు, కోటిపల్లి హరీష్, కాలం రమణ, తదితరులు పాల్గొన్నారు.



గుర్రాల రథంపై ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దాట్ల

ప్రయోగాలు నేర్పించడం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలో అల్లం రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో క్రియా స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్‌తో బుద్దా శ్రీనివాస్ గత పది నెలలుగా నిర్వహిస్తున్న యాక్టు సైన్స్ సెంటర్ ను శుక్రవారం పలువురు సందర్శించారు. నెదర్లాండ్స్ దేశం ఎంబసీ నుంచి ఎకనామిక్ సెక్షన్ హెడ్ యోస్ట్ గైర్, పాలసీ అడ్వైజర్ ఇమ్మి స్మిత్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కిరణ్ మధునాపంతుల ఈ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా ప్రయోగాలు నేర్పించడం అనేది స్ఫూర్తిదాయకమన్నారు. సైన్స్ ప్రయోగాలు చిన్ననాటి నుండి విద్యార్థులు స్వయంగా చేయటం వల్ల వారిలో శాస్త్రీయ ఆలోచన విధానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బుద్ధ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సెంటర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, ఉప విద్యాశాఖాధికారి టి.జోసెఫ్ సందర్శించి ఈ సైన్స్ సెంటర్‌ను అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో క్రియ కార్యదర్శి జగన్నాథం, చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, పూజిత సూర్యశ్రీ, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీ హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విజయోత్సవ ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తూర్పుపేట వై.జంక్షన్ నుంచి కోరంగి పంచాయతీ ప్రతాప్ నగర్, అంబేద్కర్ ఆరామం వరకు ఈ ర్యాలీ సాగింది. ఎంపీ, ఎంఎల్ఎలకు తూర్పు పేట వద్ద ఘనంగా స్వాగతం పలికారు. గుర్రాల రథంపై వారిని ఊరేగించారు. సుంకటరేవు జై భీమ్ పేట, ప్రతాప్ నగర్, అంబేద్కర్ భవన్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు ఎంపీ హరీష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.